క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మీర్‌పేట: మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగిస్తున్నందున సోమవారం 11కేవీ కేశవరెడ్డినగర్ ఫీడర్ పరిధిలోని కాలనీలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మీర్‌పేట ఏఈ ఎస్.ప్రభాకర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రశాంతిహిల్స్, కేశవరెడ్డినగర్, సిర్లాహిల్స్, మీర్‌పేట పోస్టాఫీస్, సీతాహోమ్స్, టీఎస్ఆర్‌నగర్ కాలనీలలో ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు.

నేడు అమరుడు యాదయ్య విగ్రహావిష్కరణ

మహేశ్వరం/తుక్కుగూడ: తెలంగాణ కోసం ఆత్మ బలిదానం చేసుకున్న మహేశ్వరం మండలం నాగారం గ్రామానికి చెందిన సిరిపురం యాదయ్య వర్ధంతి సందర్భంగా సోమవారం మహేశ్వరం గేటు వద్ద విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు. ఉదయం 10గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి మంత్రి సబితారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి హాజరు కానున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అంగోత్ రాజు నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, నియోజకవర్గంలోని ప్రజా ప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

గణేశ్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా వినోద్‌చారి



కందుకూరు: కందుకూరు నవతరం యూత్ గణేశ్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా తల్లోజు వినోద్‌చారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం ఆ యూత్ సభ్యులు సమావేశమై గణేశ్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నవతరం యూత్ మాజీ అధ్యక్షుడు కోణం వెంకటేశ్, సొడపు వెంకటేశ్‌గౌడ్, తాళ్ల కార్తీక్, అజీజ్, సభ్యులు నిరంజన్, దీక్షిత్‌రెడ్డి, సూరి, రఘుబాబు తదితరులు పాల్గొన్నారు.


ముగిసిన నవ చండీ యాగం



పూజలు నిర్వహిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి తదితరులు

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ హౌసింగ్ కాంప్లెక్స్ ఫేజ్–2లోని రేణుక రాజేశ్వరి పీఠం జగన్మాత ఆలయంలో మొల్లూరి నవీన్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రుద్ర సహిత నవ చండీ యాగం ముగిసింది. చివరి రోజైన ఆదివారం లక్ష్మీనరసింహ స్వామి అలంకారంలో దర్శమిచ్చిన స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఘనంగా పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, వనస్థలిపురం ఏసీపీ పురుషోత్తం రెడ్డి, ఇన్‌స్పెక్టర్ సత్తనారాయణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, నాయకులు నరసింహారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, వెంకట్‌రామ్ రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, శ్రావణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నపూర్ణాదేవికి బంగారు ముక్కుపుడక సమర్పణ



పూజలు నిర్వహిస్తున్న మధుర ఉపేందర్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ వాసవి కాలనీలోని అష్టలక్ష్మి ఆలయంలో అన్నపూర్ణాదేవికి యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చిలుక మధుర ఉపేందర్‌రెడ్డి దంపతులు తమ వివాహ వార్షికోత్సవం సందర్భంగా బంగారు ముక్కు పుడకను సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వారిని ఘనంగా సన్మానించారు. సంతోష్ కుమార్ స్వామి, అష్టలక్ష్మి అక్షయ ట్రస్ట్ కోశాధికారి సోమవారపు సత్యనారాయణ, అష్టలక్ష్మి ఆలయ ట్రెజరర్ ఐత అంజయ్య, గౌరీశంకర్, వంగాల శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా నాటకాల ప్రదర్శన

వనస్థలిపురం: మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా వనస్థలిపురం భక్త సమాజం ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం వనస్థలిపురం సచివాలయనగర్‌లోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయ ప్రాంగణంలో, రాత్రి సాహెబ్‌నగర్ వెంకటేశ్వరకాలనీ పార్కులో ప్రదర్శించిన శ్రీ శివపార్వతుల కల్యాణం పౌరాణిక పద్య నాటకాలు ప్రేక్షకులను విశేషంగా అలరించాయి. నాటకంలో పాత్రధారులు తమ అపూర్వ నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో భక్త సమాజం అధ్యక్ష, కార్యదర్శులు సూర్యప్రకాష్, సి.హెచ్.వి.ఆర్.కె.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శం.. శివాజీ జీవితం



బడంగ్‌పేట్: బాలాపూర్‌లో నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు



కందుకూరు: ర్యాలీలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి



బడంగ్‌పేట్: జయంతి వేడుకల్లో బీఎస్పీ నేతలు

ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా ఆదివారం నియోజకవర్గ పరిధిలో ఆయన జయంత్యుత్సవాలు ఘనంగా నిర్వహించారు. పలువురు నాయకులు ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. పలు చోట్ల బైక్ ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హిందూ సమాజంపై ఎక్కడ దాడి జరిగినా నేనున్నానంటూ అభయం కల్పించిన వీరుడు శివాజీ. సమసమాజ స్థాపనకు ఛత్రపతి శివాజీ వేసిన ప్రతీ అడుగు స్ఫూర్తిదాయకం అన్నారు. – మహేశ్వరం జోన్ బృందం



కందుకూరు: నేదునూరులో నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



పహాడీషరీఫ్: శ్రీరాం కాలనీలో...



పహాడీషరీఫ్: రక్తదానం చేసిన యువతకు గుర్తింపు పత్రాలు అందజేస్తున్న నరేశ్‌యాదవ్

ఆధ్యాత్మికత అలవర్చుకోవాలి

సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా

కడ్తాల్: ఆధ్యాత్మికతతో భక్తి భావం పెంపొందుతోందని, దీంతో సమాజంలో శాంతి నెలకొంటుందని సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్‌గుప్తా అన్నారు. మండల పరిధిలోని ఎక్వాయిపల్లిలో మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు జోగు వీరయ్య ఆధ్వర్యంలో శివస్వాములు నిర్వహించిన మహాపడిపూజలో ఆయన పాల్గొన్నారు. అనంతరం మాలధారణ స్వాములు శ్రీశైలం క్షేత్రానికి బయలుదేరి వెళ్లారు. అంతకుముందు భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుగుణ, ఉప సర్పంచ్ ముత్యాలు, ఎంపీటీసీ సభ్యురాలు నిర్మలమ్మ పాల్గొన్నారు.

26న కుమ్మరుల ఆత్మీయ సమ్మేళనం

ఇబ్రహీంపట్నం: ఈనెల 26న యాచారం మండల కేంద్రంలో కుమ్మరుల నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమ్మేళనం, కవయిత్రి మొల్లా విగ్రహావిష్కరణకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆదివారం ఆ సంఘం నేతలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ డైరెక్టర్ గణేశ్ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు. నియోజకవర్గంలోని కులస్తులంతా పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజవయంతం చేయాలని కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ఆమనగల్లు: శెట్టిపల్లి గ్రామానికి చెందిన వినోదకు సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ.16 వేలు, మాడ్గుల మండలం పల్లెతండాకు చెందిన కృష్ణకు రూ.లక్ష మంజూరయ్యాయి. ఈ మేరకు ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ తన నివాసంలో ఆదివారం ఈ చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ నారాయణ, సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అర్జున్‌రావు, యువజన విభాగం అధ్యక్షుడు సత్యం పాల్గొన్నారు.

కేంద్రం నిధులు దారి మళ్లింపు



కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న ప్రతాప్

బీజేపీ రాష్ట్ర నాయకుడు ప్రతాప్

బడంగ్‌పేట్: కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులను దారిమళ్లించి బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతి, అక్రమాలకు పాల్పడుతోందని బీజేపీ రాష్ట్ర నాయకుడు, వనపర్తి జిల్లా ఇన్‌చార్జి బోసుపల్లి ప్రతాప్ ధ్వజమెత్తారు. కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్‌లో శక్తి కేంద్రాల ఇన్‌చార్జి నిమ్మల రవికాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రజాగోస– బీజేపీ భరోసా పేరుతో కార్నర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం కుటుంబ పాలన సాగిస్తోందన్నారు. కేసీఆర్‌కు సీఎంగా అవకాశం ఇస్తే అబద్ధాలు, మాయమాటలతో ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో నిరుద్యోగులను పట్టించుకునే వారే లేరని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్త పెన్షన్లు, రేషన్‌కార్డులు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. ధరణి పేరుతో రైతులను గోస పెడుతున్నారని మోదీతోనే దేశానికి సుపరిపాలన అందుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీదే అధికారం అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి, కార్పొరేటర్లు నిమ్మల సునిత, తోట శ్రీధర్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్, రఘునందన్‌సింగ్, బూత్ అధ్యక్షుడు తోట ప్రతాప్‌రెడ్డి, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, అంజిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, తిరుపతి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం



నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేత నర్సింహారెడ్డి

మహేశ్వరం: మండల కేంద్రంలోని ఏపూరి యాదయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చిగురింత నర్సింహారెడ్డి ఆదివారం నివాళి అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యాదయ్య మృతి బాధాకరమన్నారు. ఆపదలో ఉన్నవారికి ఎల్లవేలలా సహకరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అల్లె కుమార్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మునావత్ దశరథ్ నాయక్, యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఒగ్గు శ్రీకాంత్, పార్టీ సీనియర్ నాయకులు వత్తుల నారాయణ, ఏపూరి జంగయ్య, రాజు, సంగారెడ్డి, నవీన్, స్వామి, శశికాంత్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పట్నం చేరిన పాదయాత్ర

మంగళహారతులతో మహిళల స్వాగతం



ఇబ్రహీంపట్నం చేరుకున్న ప్రశాంత్‌కుమార్ రెడ్డి

ఇబ్రహీంపట్నం: బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి చేపట్టిన ప్రగతి నివేదన పాదయాత్ర ఆదివారం ఇబ్రహీంపట్నం చేరింది. ఈ సందర్భగా మహిళలు మంగళహారతులతో ఘనస్వాగతం పలికారు. యువకులు టపాసులు కాల్చుతూ.. పూలదండలు వేస్తూ అట్టహాసంగా పట్టణంలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన పార్టీ జెండా ఆవిష్కరించి మున్సిపాలిటీలో గడపగడపకు తిరుగుతూ సీఎం కేసీఆర్ నాయకత్వంలో, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కృపేశ్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఆకుల యాదగిరి, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు అల్వాల్ వెంకట్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రాములు, కౌన్సిలర్లు భానుబాబు, జగన్, సుజాత, సుధాకర్, మమత, పద్మయాదవ్, ప్రసన్నలక్ష్మి, రమేశ్, జగదీశ్, శ్వేత, బాలరాజు, కోఆప్షన్ మెంబర్ మొహిజ్‌పాషా, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు రాజు, అంజిరెడ్డి, భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే ప్రజల కష్టాలు దూరం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రేమ్‌రాజ్

శంషాబాద్: రాష్ట్ర ప్రజల కష్టాలు తీరాలంటే బీజేపీ అధికారంలోకి రావాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ మాజీ సభ్యుడు డాక్టర్ ప్రేమ్‌రాజ్ అన్నారు. ప్రజాగోస–బీజేపీ భరోసా పేరిట పట్టణంలోని బృందావన్ టౌన్‌షిప్ వద్ద ఆదివారం సాయంత్రం నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ దేశాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తుంటే సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అధోగతి పాలుచేస్తున్నారన్నారు. స్వరాష్ట్రం సాధించిన తర్వాత తీరాల్సిన కష్టాలు మరింత పెరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చింతల నందకిశోర్‌గుప్తా, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.శ్రీధర్, రాష్ట్ర నాయకుడు సెవెళ్ల మహేందర్, ఎస్సీసెల్ రాష్ట్ర నాయకుడు కె.ప్రశాంత్, రమేష్, జితేందర్, భాస్కర్‌రెడ్డి, చింటు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ షర్మిలను అరెస్ట్ చేయడం దురదృష్టకరం

రాజేంద్రనగర్: ఒక మహిళ గురించి అభ్యంతరకరంగా మాట్లాడిన ఎమ్మెల్యేను అరెస్టు చేయకుండా ప్రశ్నించిన వారిని అరెస్టు చేయడం దురదృష్టకరమని రాజేంద్రనగర్ నియోజకవర్గ వైఎస్ఆర్‌టీపీ యువజన విభాగం కన్వీనర్ సదాల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. మహబూబాబాద్ ఎమ్మెల్యే శంకర్‌నాయక్ వైఎస్ఆర్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల గురించి అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారన్నారు. తనపై చేసిన అనుచిత వ్యాఖ్యలపై, ఎమ్మెల్యే ఇచ్చిన హామీల గురించి బహిరంగ సభలో వైఎస్ షర్మిల ప్రశ్నించారని, ఈ విషయంలో ఆమెను అరెస్టు చేయడం బాధాకరమన్నారు. ప్రశ్నించే వారిని అరెస్టు చేయడం బీఆర్ఎస్ పార్టీకి అలవాటైందన్నారు. ప్రజలు అంతా గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు.

రూ.4.20కోట్లతో వంతెన నిర్మాణం

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డులో ప్రమాదకరంగా మారిన పెద్దఅంబర్‌పేట–కొహెడ గ్రామాల మధ్యనున్న వాగులపై వంతెన నిర్మాణ పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. వర్షాకాలంలో వరద నీటి కారణంగా ఈ రోడ్డుపై ప్రయాణానికి ఇబ్బందులు తప్పడం లేదని బీఆర్ఎస్ మహిళా విభాగం పట్టణ అధ్యక్షురాలు రేణుకాజగన్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కృష్ణారెడ్డిల ఆధ్వర్యంలో స్థానికులు పలుమార్లు ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకురాగా, స్వయంగా పరిశీలించిన ఎమ్మెల్యే ఈ వాగులపై వంతెనల నిర్మాణానికి రూ.4.20 కోట్లు మంజూరు చేసినట్లు వారు తెలిపారు. ఈ మేరకు ఆదివారం పనులు ప్రారంభం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వంతెనల నిర్మాణానికి ప్రత్యేక చొరవ తీసుకున్న మంచిరెడ్డికి స్థానికులు జగన్, రాము, సుధాకర్, గిరీశ్, శివకుమార్, లక్ష్మన్, ప్రశాంత్ కృతజ్ఞతలు తెలిపారు.

నేడు విద్యార్థులకు వ్యవసాయంపై అవగాహన

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ వర్సిటీలో సోమవారం జీవరసాయనాలు, జీవన ఎరువులు, జీవ ఉత్తేజకాలను మొక్కల పోషణకు వినియోగించుకోవడంపై నేడు విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు రిజిస్ట్రార్ సుధీర్‌కుమార్ తెలిపారు. సేంద్రీయ వ్యవసాయం, పర్యావరణ అనుకూల వ్యవసాయం, హానికర మందులకు బదులుగా ఇతర ప్రయోగాలు చేస్తామన్నారు. ఈ శిక్షణలో సీనియర్ శాస్త్రవేత్తలు విద్యార్థులకు సూచనలు చేస్తారని చెప్పారు.

కొత్త రోడ్డుతో వెసులుబాటు



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కౌన్సిలర్లు లక్ష్మీనారాయణ, శంకర్

పనులు పరిశీలించిన ఇద్దరు కౌన్సిలర్లు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలోని శ్రీరాం కాలనీలో రూ.1.30 కోట్ల వ్యయంతో రోడ్డును నిర్మిస్తున్నామని, ఇంది స్థానికులకు ఎంతో వెసులుబాటుగా మారనుందని కౌన్సిలర్లు కె.లక్ష్మీనారాయణ, పి.శంకర్ అన్నారు. సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం వారు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. ముత్యాలమ్మ ఆలయం నుంచి శ్రీరాం కాలనీకి వచ్చే రహదారి శిథిలావస్థకు చేరడంతో రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు పడుతూ వచ్చారన్నారు. సమస్యను మున్సిపల్ కౌన్సిల్‌కు, మంత్రి సబితారెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో నిధులు మంజూరయ్యాయన్నారు. నీరు నిలిచే ప్రాంతాల్లో సీసీ రోడ్డు, పల్లపు ప్రాంతాలలో బీటీ రోడ్లను వేస్తామన్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చూస్తున్నామన్నారు.

లాభాల బాటలో సహకార సంఘం

డీసీసీబీ వైస్ చైర్మన్ సత్తయ్య



కేక్ కటింగ్‌లో పాల్గొన్న పాలకవర్గం

తుర్కయంజాల్: పాలకవర్గం, రైతులు, సిబ్బంది సహకారంతో తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘాన్ని మూడేళ్లలో లాభాల బాటలో నడిచేలా తీర్చిదిద్దామని సంఘం వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అన్నారు. పాలకవర్గం ఏర్పడి మూడేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కేక్ కట్ చేసి సంబురాలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 18 ప్రభుత్వ పాఠశాలలకు స్మార్ట్ టీవీలు అందజేశామన్నారు. రైతులకు 600 స్ప్రేయర్స్, 10 పవర్ వీడర్స్, 802 టార్పాలిన్‌లు, చాప్ కట్టర్ పంపిణీ చేశామన్నారు. వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి అద్దాలు ఉచితంగా పంపిణీ చేశామని గుర్తు చేశారు. కొహెడలో చేపట్టిన గోదాం నిర్మాణం పూర్తయిందన్నారు. కోల్డ్ స్టోరేజీ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయన్నారు. రూ.50వేల లోపు రుణాలున్న 72 మంది రైతులకు మాఫీ చేశామని వివరించారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు కొత్త రాంరెడ్డి, డైరెక్టర్లు కొంద్రు స్వప్న, సంజీవరెడ్డి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ టీపీతోనే సంక్షేమ పాలన



శ్రీనివాస్‌గౌడ్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న అర్జున్‌రెడ్డి

పార్టీ కల్వకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి అర్జున్‌రెడ్డి

కడ్తాల్: వైఎస్సార్ టీపీతోనే వైఎస్సార్ సంక్షేమ పాలన అందుతుందని పార్టీ కల్వకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి చీమర్ల అర్జున్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎక్వాయిపల్లి గ్రామానికి చెందిన బాలగొని శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో వివిధ పార్టీలకు చెందిన వంద మంది యువకులకు, మహిళలు వైఎస్సార్‌టీపీలో చేరారు. వారికి అర్జున్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పేదలకు అవసరమైన సంక్షేమ పథకాలు చేపట్టి వైఎస్సార్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. అలాంటి సంక్షేమ పాలన తిరిగి తెలంగాణలో రావాలంటే షర్మిల నేతృత్వంలోని వైఎస్సార్ టీపీకి ప్రజలు పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల ఇబ్బందులను గాలికొదిలేసిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యేుడు రమేశ్‌నాయక్, రిషిగౌడ్, కృష్ణ, మహేందర్ తదితరులున్నారు.

హామీల అమలులో ప్రభుత్వాలు విఫలం

పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్



హాథ్ సే హాథ్ జోడో యాత్రలో శ్రీనివాస్‌గౌడ్, నాయకులు

కడ్తాల్: హామీల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో కార్యక్రమం ముద్విన్ మండల పరిధిలోని ముద్విన్ గ్రామంలో ఆదివారం కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం పార్టీ శ్రేణులతో కలిసి గడపగడపకు తిరుగుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును ప్రజలకు వివరిస్తూ ఎండగట్టారు. ఇరు ప్రభుత్వాలు నిరంకుశ పాలన సాగిస్తున్నాయని ఆరోపించారు. నిత్యావసర ధరలు పెంచుతూ.. ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్నాయన్నారు. ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని విమర్శించారు. ధరణితో పేరుతో రైతులను దగా చేసిందని, విద్యుత్, బస్సు చార్జీలు, రిజిస్ట్రేషన్ చార్జీలను పెంచి, బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను దోచుకుంటోందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రూ.2 లక్షల రుణమాఫీ, రూ.5లక్షల వరకు ఆరోగ్యశ్రీ, రూ.500కే వంటగ్యాస్ పథకాలను అమలు చేయనుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రవికాంత్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బీక్యానాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యాట నర్సింహ, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు రాములుగౌడ్, ముద్విన్ గ్రామ అధ్యక్షుడు మధు, మాజీ సర్పంచ్ యాదయ్య, నాయకులు హీరాసింగ్, రామకృష్ణ, పెద్దయ్య, వెంకటేశ్, ప్రవీన్, నర్సింహ, నరేశ్, సురేశ్, స్వామి, దశరథ్,శ్రీకాంత్, స్వామి తదితరులు ఉన్నారు.